సీఎంఏ ఫలితాలలో మాస్టర్ మైండ్స్ విద్యార్థికి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు

తేజస్విని (ఫస్ట్ ర్యాంకర్)

సిటీబ్యూరో, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): సీఎంఏ ఫలితాలలో మాస్టర్ మైండ్స్ విద్యార్థిని కె.తేజస్విని ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించింది. ఈ మేరకు మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో కొత్తపేట తేజస్వినికి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు వచ్చిందని తెలిపారు. తేజస్విని స్వస్థలం అన్నమయ్య జిల్లాలోని కన్నెమడుగు గ్రామం. ఆమెది సాధారణ రైతు కుటుంబం. సీఏ ఫైనల్ ఫలితాల్లో కూడా ఆల్ ఇండియా 14వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. తేజస్విని విద్యాభ్యాసం కూడా జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగింది. ఇంటర్, ఎంఈసీ నుంచి సీఏ ఫైనల్ వరకు తేజస్విని మాస్టర్ మైండ్స్‌లో చదువుకున్నారని చెప్పారు.

లక్ష్మీనారాయణకు ఆల్ ఇండియా మూడో ర్యాంకు

థర్డ్ ర్యాంక్ లక్ష్మీనారాయణ

సిటీబ్యూరో, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): సీఎంఏ ఇంటర్ ఫలితాలలో ఎమ్వీ లక్ష్మీ నారాయణ ఆల్ ఇండియా మూడో ర్యాంక్ సాధించారని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ తెలిపారు. పల్నాడు జిల్లాలోని దాచేపల్లికి చెందిన లక్ష్మీనారాయణ ఈ ఘనత సాధించాడని చెప్పారు. అతడు పదో తరగతి వరకు ఏపీ మోడల్ స్కూల్‌లో చదివాడని, రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి అని మాస్టర్ మైండ్స్ సంస్థ కొనియాడింది. ఇటీవల విడుదలైన సీఏ ఇంటర్ ఫలితాల్లోనూ ఆల్ ఇండియా 38వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు.

25న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కాచిగూడ, ఆగస్టు 23: మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్(23-24) విద్యార్థులకు ఈ నెల 25వ తేదీ(ఆదివారం) ఉదయం 10 గంటలకు కాచిగూడ మున్నూరు కాపు మ్యాడం అంజయ్య హాల్లో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు పన్నాల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాసరావు, ఆకుల నగేశ్, దేవేందర్, ఏ.చంద్రశేఖర్, రాఘవేందర్ పాల్గొన్నారు. వివరాలకు ఫోన్ నం. 94916 27404, 040 - 2465 8160, 2465 7404లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రీయ బాల పురస్కారాలకు దరఖాస్తులు

ఈ నెల 31వ తేదీ గడువు

సిటీబ్యూరో, ఆగస్ట 23(నమస్తే తెలంగాణ): రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సంక్షేమ అధికారి ఇ.అక్కేశ్వరరావు శుక్రవారం పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన బాల బాలికలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2025 అవార్డు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఐదేండ్ల నుంచి 18 ఏండ్ల లోపు బాల బాలికలు అర్హులని వివరించారు. ధైర్య సాహసాలు, సోషల్ సర్వీస్, క్రీడలు, పర్యావరణం, సాంస్కృతిక కళలు, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి సేవా రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్ నేషనల్ అవార్డ్ పోర్టల్ awerds.gov.in లో ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహిళా క్యాంటీన్ల ఏర్పాటులో జాప్యం

- జిల్లాలో ప్రారంభానికి నోచుకుని మహిళా క్యాంటీన్లు
- ఉన్నతాధికారులు ఆదేశించినా ఇప్పటి వరకు.. ప్రారంభానికి నోచుకోలె..

మేడ్చల్ జిల్లాలోని మహిళ సంఘాల గ్రూప్ సభ్యులు

మేడ్చల్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): మహిళ సాధికారిత దిశగా మహిళా క్యాంటీన్ల ఏర్పాటులో త్రీవ జాప్యం కనపడుతుంది. మహిళలను లక్షాధికారులుగా చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చెబుతున్నప్పటికీ అంతగా ఫలితాలు సాధించలేక పోతుంది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులచే మహిళా శక్తి ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించిన ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐదింటిని ఏర్పాటు చేయాలని లక్ష్యం సూచించిన ఇప్పటి వరకు నేరవేరలేదు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్, కీసర మండలాలలో మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో పాటు జిల్లాలోని 13 మున్సిపాలిటీలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న సర్కిళ్లతో సహా మొత్తంగా 20 మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు చేసేలా చూస్తున్న అమలులో మాత్రం సాధ్యం కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 3,392 మహిళా స్వయం సహాయక సంఘాలు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 3.3392 మహిళ సంఘాలు ఉండగా, ఇందులో 37,670 మంది సభ్యులు ఉన్నారు. మహిళ సంఘాల ఆధ్వర్యంలో చేసుకుంటున్న వ్యాపారాల అర్హత ప్రకారం, మహిళ సంఘాలకు బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలను అందిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు మహిళా క్యాంటీన్ల ఏర్పాటు చేసుకునే విధంగా అవకాశం గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అందించే విధంగా చూసిన క్యాంటీన్ల ఏర్పాటులో మాత్రం ఫలితం కనుబడుట లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నాలుగు మండల కేంద్రాలైన ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట్, మేడ్చల్‌లో ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఇప్పటి వరకు మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలకే పరిమితమైనట్లు కనిపిస్తుంది. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా క్యాంటీను ఏర్పాటుకు ప్రత్యేక గదులు కేటాయించిన ఇప్పటి వరకు ప్రారంభానికి మాత్రమే నోచుకోలేదు.

వ్యర్థాల అక్రమ డంపింగ్‌లో టిప్పర్ల సీజ్

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న బాచుపల్లి పోలీసులు

దుండిగల్, ఆగష్టు 23: ఇతర ప్రాంతాల నుంచి భవన నిర్మాణ వ్యర్థాలను రాత్రి వేళల్లో తీసుకువచ్చి నివాస ప్రాంతాలు, ప్రభుత్వ భూముల్లో డంపింగ్ చేస్తున్న టిప్పర్లను బాచుపల్లి పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం, టిప్పర్ల యజమానులకు జరిమాన విధించారు. సీఐ ఉపేందర్ తెలిపిన ప్రకారం, బాచుపల్లి మండలం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని సర్వే నం.186, ప్రభుత్వ స్థలం, డబుల్ బెడ్ రూం ఇండ్ల సమీపంలో గత కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్లలో నిర్మాణ వ్యర్థాలను తీసుకువచ్చి డంప్ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు కాపు కాయగా, శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ఐదు టిప్పర్లు నిర్మాణ వ్యర్థాల లోడుతో రాగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసుల విచారణలో గాజుల రామారం, సూరారం, కైసర్ నగర్ ప్రాంతాల నుంచి ఈ భవన నిర్మాణ వ్యర్థాలను రాత్రివేళ్లో తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నట్లు తేలింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యానికి పాల్పడుతూ నిజాంపేట్, బాచుపల్లి డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమీప ప్రాంతాలలో టిప్పర్లను తిప్పుతూ స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. మొదటిసారి దొరికారు కాబట్టి, జరిమానా విధించామని, ఇది పునరావృతమైతే, కఠినమైన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తుంది. అయితే, నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేయడం ఒక మాఫియాగా మారిందని తెలుస్తుంది.

సినీ హీరో రవి తేజకు గాయం..

మాదాపూర్, ఆగస్టు 23: సినీ హీరో రవితేజ భుజానికి గాయం కావడంతో రెండు రోజుల క్రితం హైటెక్ సిటీలోని యశోద దవాఖానలో చికిత్స తీసుకొని శుక్రవారం డిశ్చార్జి అయినట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి. రవితేజ ఆర్టీ 75 సినిమా షూటింగ్‌లో గాయపడటంతో యశోద దవాఖాన వైద్యులు చికిత్స అందించారు. ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సమాచారం.

అంగన్వాడీ కేంద్రాల్లో పౌర సరఫరాల తనిఖీలు

సిటీబ్యూరో, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అంగన్వాడీ కేంద్రాలు, 44 సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత తనిఖీలు జరిగాయి. సన్న బియ్యం నాణ్యత, పరిమాణాన్ని పరిశీలించామని అధికారులు తెలిపారు. బియ్యం నాణ్యతపై సంతృప్తికరంగా ఉన్నామని అధికారులు తెలిపారు. కేవలం ఆహార పదార్థాల నాణ్యతను తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించామని అధికారులు వెల్లడించారు.

అటల్ పెన్షన్ యోజన అవుట్ రీచ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ సభ్యురాలు మమతా శంకర్

అర్హులందరికీ అటల్ పెన్షన్ అందేలా చూడాలి

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ సభ్యురాలు మమతా శంకర్

సిటీబ్యూరో, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న అటల్ పెన్షన్ యోజన పథకం అందరికీ అందేలా చూడాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ సభ్యురాలు మమతా శంకర్ బ్యాంకర్లకు సూచించారు. నగరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఎస్బీఐ, నాబార్డు, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. అసంఘటిత రంగంలో ఉన్న దేశ ప్రజలకు మేలు చేసేలా రూపొందించిన ఏపీవైను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఈ పథకానికి అర్హులన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ ఆర్డీఏ ఏజీఎం రూబీ వినాయక్ భావ్‌సాగర్, ఎస్బీఐ డీజీఎం ప్రియ భత్రా మిశ్రా, నాబార్డ్ ఏజీఎం హరీష్, కెనరా బ్యాంకు డీజీఎం రాకేష్ రోషన్ వర్మ, యూనియన్ బ్యాంకు ఏజీఎం బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంకీ పాక్స్ నోడల్ కేంద్రాలుగా గాంధీ, ఫీవర్లు

ముందు జాగ్రత్త చర్యగా 20 పడకలతో ప్రత్యేక వార్డులు

సిటీబ్యూరో, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): కరోనా వైరస్ తరువాత ఎలాంటి వైరస్‌లు వచ్చినా జనాలు కొంత భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే మంకీ పాక్స్ అనే వైరస్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న కేసుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాలను అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగానే కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచనల మేరకు తెలంగాణ సర్కార్ సైతం మంకీ పాక్స్‌ను ఎదుర్కొనే దిశగా ముందస్తు చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలో ఒక వేళ కేసులు నమోదైతే చికిత్స అందించేందుకు గాంధీ, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్స్‌ను నోడల్ కేంద్రాలుగా ప్రకటించింది. గాంధీలో 14 పడకలతో కూడిన మంకీపాక్స్ వార్డును ఏర్పాటు చేసింది. ఎక్కడైనా మంకీపాక్స్ కేసులు నమోదైనా లేక అనుమానిత లక్షణాలున్నా ఆ రోగులకు ఈ ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో చికిత్స అందించనున్నట్లు గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్ కుమారి వెల్లడించారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా వార్డులను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా కూడా కేసులు నమోదు కాలేదని, ముందు జాగ్రత చర్యగా రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు మంకీపాక్స్ వార్డులను ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డా.రాజ్ కుమారి స్పష్టం చేశారు. ఈ వైరస్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, సపోర్టింగ్ ట్రీట్‌మెంట్ మాత్రమే ఉంటుందన్నారు.

ఫీవర్ హాస్పిటల్‌లో..

నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో సైతం ముందు జాగ్రత చర్యగా ఆరు పడకలతో మంకీపాక్స్ వార్డును ఏర్పాటు చేసినట్లు దవాఖాన ఆర్ఎంఓ డా.జయలక్ష్మి తెలిపారు. మంకీపాక్స్ బాధితులకు, అనుమానిత లక్షణాలున్న వారికి నిర్ధారణ పరీక్షలు చేసి, ఈ వార్డులో చికిత్స అందించేందుకు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి కేసులు గాని, అనుమానిత కేసులు గాని రాలేదని, కేవలం ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే ఈ వార్డును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఎన్ కన్వెన్షన్ కబ్జాపై ఫిర్యాదు

మాదాపూర్, ఆగస్టు 23: చెరువులను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, చెరువుల అభివృద్ధికి కృషి చేయాలని జనం కోసం అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని తమ్మిడి కుంట చెరువులో అక్రమంగా వెలిసిన ఎన్ కన్వెన్షన్ పేరుతో సినీ నటుడు అక్కినేని నాగార్జున శుక్రవారం జనం కోసం అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి తమ్మిడి కుంట పూర్తి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మ్యాపులను అందజేసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువులను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, చెరువుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చెరువులు పలు చోట్ల అన్యాక్రాంతం అవుతున్నట్లు తెలిపారు. చెరువులను అభివృద్ధి చేసి కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తమ్మిడి కుంట చెరువు మొత్తం 29 ఎకరాల 24 గుంటలు ఉండగా, అందులో నాగార్జున 3 ఎకరాల 30 గుంటల వివరాలను ఆధారాలతో అందించినట్లు తెలిపారు. దీనికి స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువులను కాపాడటం గొప్ప విషయమని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డిని అభినందించారు. చెరువులను పరిరక్షించడంలో జనం కోసం సహకారం తీసుకుంటామని చెప్పారు. ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

హ్యాకథాన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నాయకత్వ బృందం సభ్యురాలు మీరాదేవి, చిత్రంలో వీసీ వీఎస్‌కే రెడ్డి

సాంకేతికతకు విపరీతంగా పెరిగిన ప్రాముఖ్యత

మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి

మేడ్చల్, ఆగస్టు 23: ప్రస్తుత యుగంలో సాంకేతికతకు ప్రాముఖ్యత విపరీతంగా పెరిగిపోయిందని, ప్రతి రంగంలో సాంకేతికత ప్రముఖ పాత్ర పోషిస్తుందని మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎస్‌కే రెడ్డి అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో 24 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, కొత్త కొత్త సాంకేతిక అంశాలు అందుబాటులోకి వస్తూ పనులను సులభతరం చేస్తున్నాయన్నారు. కంప్యూటర్ సైన్స్‌తో పాటు డేటా సైన్స్, జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, జనరల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. హ్యాకథాన్ ద్వారా విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేసి, నూతన ఆవిష్కరణల ద్వారా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆంజనేయులు, కార్యక్రమ నాయకత్వ బృందం సభ్యులు డాక్టర్ కమతం హరికృష్ణ, డాక్టర్ మీరా దేవీ, జీఎస్ నవీన్ కుమార్, ఆనంద్ కుమార్, రాజా శరత్ కుమార్ పాల్గొన్నారు.

నిర్మాణ రంగానికి తోడ్పాటు అందిస్తాం

- ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఉప్పల్‌లో మూడు రోజుల పాటు క్రెడాయ్ ప్రాపర్టీ షో
- ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఉప్పల్, ఆగస్టు 23: అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నిర్మాణరంగానికి తగిన తోడ్పాటు అందిస్తామన్నారు. నిర్మాణ రంగానికి ఉపయోగపడే విధంగా స్కిల్ యూనివర్సిటీ నుంచి నైపుణ్యం కలిగిన నిపుణులు అందుబాటులోకి వస్తారని తెలిపారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రాపర్టీ షో ఉప్పల్‌లోని భగాయత్ శిల్పారామం సమీపంలో శుక్రవారం నిర్వహించారు. ఆగస్టు 23 నుంచి 25 వరకు జరుగనున్న ఈ ప్రాపర్టీ షోను మంత్రి శ్రీధర్ బు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ, మాట ఇస్తే కట్టుబడి ఉంటామని, రియల్ రంగం అభివృద్ధికి తగిన తోడ్పాటును అందిస్తామన్నారు. మౌలిక వసతులు, పన్నుల మినహాయింపు, తదితర అంశాలపై తగిన విధంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రణాళికలు లేకుండా పనులు చేపడితే ఇబ్బందులు వస్తాయని, అందుకే, తగిన విజన్‌తో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రవాణ రంగానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఔటర్ రింగురోడ్డు వరకు మెట్రో సేవలు విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఐటీతోపాటు, పారిశ్రామిక రంగానికి పెద్ద పీట వేస్తామన్నారు. ఈస్ట్ వైపు ఐటీ పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఐటీ కోసం కన్వెన్షన్ సెంటర్‌ను సీఎంతో సంప్రదించి ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. అభివృద్ధికి దోహదం చేసే అన్ని రంగాలకు తోడ్పాటు అందించే విధంగా చూస్తామన్నారు. 15 వేల ఎకరాల విస్తీర్ణంలో కొత్త నగరం నిర్మాణం చేపట్టనున్నామని, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలో మొదటిదిగా నిలిచిపోతుందన్నారు. కొనుగోలు శక్తి పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇల్లు ఉన్నప్పుడే స్థిరపడినట్లు భావిస్తారని తెలిపారు. నాణ్యమైన నిర్మాణంతోనే ఆదరణ ఉంటుందన్నారు. హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసే విధంగా సహకారం అందిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. నగరంలో అన్ని వైపులా అభివృద్ధి జరిగే విధంగా ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఫీర్జాదిగూడ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎలెక్టెడ్ అధ్యక్షుడు జైదీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్నాథ రావు, వైస్ ప్రెసిడెంట్స్ మురళీ, శ్రీకాంత్, రాంబాబు, కోశాధికారి మనోజ్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ సతీష్ పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మొయినాబాద్, ఆగస్టు 23: అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను పంచాయతీ అధికారులు కూల్చివేశారు. మొయినాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ కూల్చి వేశారు. భవనం నిర్మాణంలో భాగంగా గోడలు కడుతుండగా వాటిని జేసీబీ సహాయంతో అధికారులు నేలమట్టం చేశారు. దానితో పాటు ప్లాట్లకు వేసుకున్న ఫ్రీకాస్టును సైతం పడగొట్టారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలి

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ రెక్టార్ విజయ కుమార్ రెడ్డి

వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఒరియేంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న రెక్టార్ విజయ కుమార్ రెడ్డి, చిత్రంలో వర్సిటీ సిబ్బంది

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 23: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని, యూనివర్సిటీ కళాశాలలలో వసతులను సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ రెక్టార్ విజయ కుమార్ రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలోని జేఎన్ ఆడిటోరియంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో చేరిన విద్యార్థులకు శుక్రవారం ఒరియెంటేషన్ (అవగాహన సదస్సు)ను నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వి.పద్మావతి, సీఆర్‌సీ చైర్ పర్సన్ వి.పార్వతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జేఎన్‌టీయూహెచ్‌లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలలో ఉన్నారని, వర్సిటీ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధన అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా, ప్రవర్తన, నడవడిక, సమాజం పట్ల బాధ్యత, తల్లిదండ్రుల పట్ల గౌరవం, ప్రొఫెసర్లు, తోటి విద్యార్థుల పట్ల స్నేహం, సహాయ సహకారం వంటి గుణాలను పెంపొందించుకోవాలన్నారు. ఇంజినీరింగ్‌లో చదువు కీలకమని, బాధ్యతగా చదివితేనే ఉజ్వల భవిష్యత్ కనిపిస్తుందన్నారు. విద్యార్థి జీవితం ఇక్కడే ప్రారంభమవుతుందని, మంచి, చెడు దారులు కనిపిస్తాయని, ఏ దారిలో వెళ్లాలో విద్యార్థులే నిర్ణయించుకోవాలన్నారు. తల్లిదండ్రుల పడుతున్న కష్టాన్ని మరవొద్దని, బాధ్యత గల విద్యార్థిగా చదువుని గురువులకు, తల్లిదండ్రులను మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలను బానిసలు కావొద్దని, ర్యాగింగ్ లాంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. వర్సిటీలో పలు కొత్త కోర్సులు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నతంగా ఎదిగి, ఆదర్శవంతగా జీవించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

ఇంటి వాతావరణమే సురక్షితంగా లేదు

- చిన్నారులపై లైంగిక దాడి అంశంపై అసెంబ్లీలో చర్చ జరగాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, ఆగస్టు 23: దేశంలో, రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందని, ఇంటి వాతావరణమే వారికి సురక్షితంగా లేకుండా పోయిందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఎంవీ ఫౌండేషన్, కేరింగ్ సిటిజన్స్ కలెక్టీవ్, అంకురం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పిల్లలపై అశ్లీలత, లైంగిక దాడి నుంచి రక్షణ కోసం ప్రభుత్వ చర్యలు, తల్లిదండ్రులు, సమాజం బాధ్యత' అనే అంశంపై పలువురు వక్తలు మాట్లాడారు. ప్రముఖ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ నల్లమోతు శ్రీధర్ మాట్లాడుతూ, పిల్లలకు ఫోన్లు ఇచ్చినప్పుడు ఎలాంటివి వీక్షిస్తున్నారన్న దానిపై దృష్టి పెట్టాలన్నారు. కిడ్స్ బ్రౌజర్స్ లాంటి యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్నారు. పి